హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442

యాదాద్రి : 1800 425 7106

సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.140	203	231
సూర్యాపేట	రూ.120	170	190
నల్లగొండ	రూ.150	216	240

ఉష్ణోగ్రత గరిష్ఠం 40.5 | కనిష్ఠం 24.4

రైతుల పంటలు ఎండిపోతున్నాయి. నీరు లేక బీడు భూములుగా మారుతున్నాయి. ఎండిన పంటలు పశువులకు మేత అవుతున్నాయి. ఈ దుస్థితికి కారణం ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వమే. ఎండిన పంటలకు ఎకరాకు రూ.25వేల చొప్పున పరిహారం ఇవ్వాల్సిందే. రైతులు అధైర్య పడవద్దు. మీకు పరిహారం ఇప్పించే వరకూ ప్రభుత్వంపై పోరాడేందుకే వచ్చా.. అని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. సూర్యాపేట జిల్లాలో రైతుల పంట పొలాల పరిశీలన కోసం వచ్చిన ఆయన రైతులతో మాట్లాడారు. వారి లో భరోసా నింపారు.

- (ఆంధ్రజ్యోతి ప్రతినిధి-నల్లగొండ)





సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం వెలుగుపల్లిలో రైతులతో మాట్లాడుతున్న కేసీఆర్

ప్రభుత్వంపై పోరాడేందుకే వచ్చా

- ఎండిన పంటలకు ఎకరాకు రూ.25వేలు ఇవ్వకుంటే వెంటాడుతా
- రైతులెవరూ ఆత్మహత్యలకు పాల్పడవద్దు
- సూర్యాపేట జిల్లాలో పంటపొలాల పరిశీలన
- రూ.500 బోనస్ చెల్లించాలని రేపు కలెక్టర్లకు వినతిపత్రాలు, 6న నియోజకవర్గాల్లో ఒకరోజు దీక్షలు

"కాంగ్రెస్ ప్రభుత్వపు అసమర్థత, చేతగానితనం, అవివేకం, అర్భకత్వం వల్లే ఈ రోజు పంటలు ఎండి రైతులు లక్షల రూపాయలు నష్టపోయారు. కష్టాల్లో ఉన్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి. ఎకరాకు రూ.25వేల నష్టపరిహారమివ్వాలి." అని మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన సూర్యాపేట జిల్లాలో ఎండిన పంట పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. లక్షల రూపాయలు నష్టపోయామని గోడు వెళ్లబోసుకున్న రైతులను ఓదార్చారు. రైతులకు అండగా ఉండేందుకు, వారిపక్షాన పోరాడేందుకే తాను స్వయంగా వచ్చానని చెప్పారు. ఎవరూ అధైర్యపడవద్దని, ఆత్మహత్య ల్లాంటి తీవ్ర నిర్ణయాలు తీసుకోవద్దని, ఈ ప్రభుత్వం మెడలు వంచి పనిచేయిస్తామన్నారు. పంటపొలాల పరిశీలన అనంతరం సూర్యాపేటలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా 15లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయాయని, నల్లగొండ జిల్లాలో దాదాపు 4లక్షల ఎకరాల పంట నష్టం వాటిల్లినట్లు రిపోర్టులు వస్తున్నాయని తెలిపారు. తమ ప్రభుత్వ హయాంలో వడగళ్లవానతో పంటలు దెబ్బతింటే ఎకరాకు రూ.10వేల చొప్పున కేంద్రంతో సంబంధం లేకుండా చెల్లించామని వివరించారు. 2014కు ముందు కాం గ్రెస్ ప్రభుత్వం పంట నష్టపరిహారం చెల్లించకపోతే, తమ ప్రభుత్వం వచ్చాక రూ.500 కోట్ల పరిహారమిచ్చామని గుర్తుచేశారు. ఈ ప్రభుత్వం పంటలకు నీరిస్తామంటేనే పంటలు వేసి రూ.లక్షల పెట్టుబడులు పెట్టి రైతులు నష్టపోయారని చెప్పారు.

పంటల వివరాలు తెప్పించుకోవాలి

కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే కలెక్టర్లను ఆదేశించి పంటల నష్టం వివరాలను తెప్పించుకోవాలని కేసీఆర్ డిమాండ్ చేశారు. రూ.500 బోనస్ తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. తమ ప్రభుత్వం వచ్చాకే ఎస్ఆర్ఎస్పీ ద్వారా సూర్యాపేట, తుంగతుర్తి ప్రాంతాలకు నీరిచ్చిందన్నారు. నాగార్జునసాగర్ ఆయకట్టుకు నీరిచ్చే అవకాశమున్నా ఇవ్వలేకపోయారని, కేఆర్ఎంబీ పేరుచెప్పి సమస్యల నుంచి తప్పించుకుంటున్నారని దుయ్యబట్టారు. సాగర్‌లో ఇప్పటికీ 14 టీఎంసీల నీరు వాడుకునేందుకు అవకాశమున్నా వినియోగించలేకపోయారని విమర్శించారు. తమ ప్రభుత్వ హయాంలో 18 పంటలకు ఏలోటూ లేకుండా నీరు, కరెంటు, పంట చేతికొచ్చాక మద్దతు ధర, కొనగోళ్లు సహా రైతులకు అండగా ఉన్నామని వివరించారు. రూ.2లక్షల రుణమాఫీ ఏమైందని, డిసెంబరు 9వ తేదీ వెళ్లిపోయి ఎన్ని రోజులైందని నిలదీశారు. విద్యుత్ వ్యవస్థను ఎందుకు సమర్థంగా నిర్వహించలేకపోతున్నారో సమాధానం చెప్పాలని నిలదీశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ధాన్యానికి క్వింటాకు తక్షణమే రూ.500 బోనస్ చెల్లించాలన్నారు. ఈ అంశంపై ఈ నెల 2న కలెక్టర్లకు వినతిపత్రాలు ఇవ్వాలని, ఈ నెల 6వ తేదీన అన్ని నియోజకవర్గాల్లో ఒకరోజు దీక్ష చేయాలని పిలుపునిచ్చారు. ఆయన వెంట ఎమ్మెల్యేలు గుంటకండ్ల జగదీష్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్, మాజీ స్పీకర్ మధుసూదనాచారి, ఎంపీ అభ్యర్థులు కంచర్ల కృష్ణారెడ్డి, క్యామ మల్లేశ్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, బొల్లం మల్లయ్యయాదవ్, నల్లమోతు భాస్కర్‌రావు, గాదరి కిషోర్‌కుమార్, రమావత్ రవీంద్రకుమార్, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి ఉన్నారు.



ముమ్మల్ని కాపాడాలి

మోత్కూరు/తుంగతుర్తి, సూర్యాపేట రూరల్, మార్చి 31: మా బాధలు తీర్చాలి.. మమ్మల్ని కాపాడాలి. కాంగ్రెస్ పాలనలో సాగు నీరు లేక పంటలు ఎండుతున్నాయి. రైతు బంధు రాలేదు.. కరెంటు సక్రమంగా రావడం లేదు.. అని రైతులు మాజీ సీఎం కేసీఆర్‌కు మొరపెట్టుకున్నారు. సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం వెలుగుపల్లి గ్రామ శివారులో సాగు నీరు అందక ఎండిన వరి పంటలను ఆదివారం కేసీఆర్ పరిశీలించారు. నాటు వేసిన మూడు ఎకరాలు నీరు లేక ఎండిపోవడంతో గొర్రెలను మేపుతున్న దయ్యాల వెంకటనారాయణ వరి పొలాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల నుంచి వచ్చిన కొందరు రైతులు ఎండిన వరి కట్టలు చూపించి, తమ గోడు వెళ్లబోసుకున్నారు. తాను ఒక ఎకరం పది గుంటలు నాటు వేస్తే మొత్తం ఎండిపోయిందని ధరావత్ సుశీల చెప్పారు. మీరే మమ్ములను ఆదుకోవాలంటూ ఆమె కేసీఆర్ కాళ్లమీద పడే ప్రయత్నం చేశారు. పంటలు ఎండిపోతున్నాయన్నా నీరు వదలలేదని, గత ఆరు రోజుల నుంచి కాల్వల్లోకి నీరు వస్తుందని, అప్పుడు లేని నీరు ఇప్పుడెలా వస్తుందని రైతులు ప్రశ్నించారు. కరెంటు కూడా సక్రమంగా రావడం లేదని, 24 గంటలు ఇస్తున్నామని చెబుతున్నారు, కానీ రోజుకు 16 గంటలే వస్తుందన్నారు. మీరే ప్రభుత్వంతో మాట్లాడి నష్టపరిహారం ఇప్పించాలని రైతులు కేసీఆర్‌ను వేడుకున్నారు. కార్యక్రమంలో మాజీ సీఎం కేసీఆర్ వెంట రాజ్యసభ సభ్యుడు జోగినపల్లి సంతోష్‌కుమార్, జడ్పీ చైర్‌పర్సన్ గుజ్జ దీపికయుగందర్‌రావు, డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి, సీతయ్య, సైదులు పాల్గొన్నారు.

కేసీఆర్: ఎంత పంట సాగు చేశావు?

అవిలయ్య(పోలుమల్ల): పది ఎకరాలు సార్

కేసీఆర్: ఎంత పారుతుంది?

అవిలయ్య: రెండున్నర ఎకరాలు పారుతుంది. ఏడున్నర ఎకరాలు ఎండిపోయింది.

కేసీఆర్: ఎంత పెట్టుబడి పెట్టావు?

అవిలయ్య: ఎకరాకు రూ.30వేలచొప్పున రూ.3లక్షలు పెట్టా.

కేసీఆర్: గతంలో ఏమైనా ఎండిందా?

అవిలయ్య: ఎనిమిది ఏళ్లుగా వరి సాగు చేస్తున్నా.. ఎండలేదు. ఇప్పుడు పంట ఎండిపోయి నష్టపోయిన మాకు మీరే దారి చూపాలి సారూ...

కేసీఆర్: నేను అండగా ఉంటాను. మీరు అధైర్య పడకండి. ప్రభుత్వంతో పోరాడి మీకు నష్టపరిహారం ఇప్పిస్తా.

తొమ్మిది ఎకరాలు ఎండిపోయింది

గతంలో నేను చెల్క పంటలు (పత్తి, కందులు, నువ్వులు తదితర పంటలు) సాగు చేసేవాడిని. ఎస్సారెస్పీ కాల్వల ద్వారా కాళేశ్వరం జలాలు రావడంతో ఆరేళ్ల క్రితం పొలం అచ్చుకట్టి వరి సాగు చేస్తున్నా. తొమ్మిది ఎకరాలు నాటు వేస్తే పొట్ట దశలో నీరు అందక ఎండి పోయింది. ఎకరాకు రూ.30వేలు పెట్టుబడి పెట్టా. మొదట్లోనే నీరు ఇవ్వకుంటే నాటు వేయకపోయేవాళ్లం. నష్టం జరిగేది కాదు.

- ఆంబోతు సైదులు, వెలుగుపల్లి, తుంగతుర్తి

మోసపోయాం

పదేళ్ల క్రితం ఆరుతడి పంటలు సాగుచేశాం. తెలంగాణ ప్రభుత్వం వచ్చాక.. కాళేశ్వరం నీళ్లు వచ్చి ఎనిమిదేళ్లుగా మాకు ఐదు ఎకరాల్లో వరి పొలం సాగుచేసి ఆనందంగా ఉన్నాం. ఈసారి కూడా సాగుకు నీరు ఇస్తామని ప్రభుత్వం చెప్పిన మాటాలు విని ఐదెకరాలు సాగుచేస్తే నీళ్లు రాక పొలం ఎండిపోయింది. ప్రభుత్వ మాటలు విని మోసపోయాం.

- సరోజనమ్మ, యర్కారం, మహిళా రైతు

మూడు ఎకరాలు ఎండిపోయింది

నాకు తొమ్మిది ఎకరాలుండగా కాల్వల్లో నీరు రావడం రాలేదని,ఆరు ఎకరాలు నాటు వేయకుండా పడావు పెట్టాను. మూడు ఎకరాలు మాత్రమే నాటు వేస్తే అది పూర్తిగా ఎండిపోయింది. ఎండిన వరిలో గొర్రెలను మేపుతున్నా.

- వెంకటనారాయణ, వెలుగుపల్లి, తుంగతుర్తి

నాకుమారుడు ఇంటినుంచి బయటకు రావడం లేదు

నేను 12 ఎకరాలు నాటు వేస్తే పూర్తిగా ఎండిపోయింది. పెట్టుబడికి చేసిన అప్పు ఎలా తీర్చాలని నా కుమారుడు ఇంటినుంచి బయటికి రావడం లేదు.

- సోమ్లా నాయక్, వెలుగుపల్లి, తుంగతుర్తి

కేసీఆర్ పర్యటన సాగిందిలా...

బస్సులో రోడ్డు మార్గం ద్వారా సూర్యాపేట జిల్లా తిరుమలగిరి, నాగారం, అర్వపల్లి మీదుగా తుంగతుర్తి మండలం వెలుగుపల్లి గ్రామంలో ఎండిన వరి పొలాల వద్దకు వచ్చారు. షెడ్యూల్ ప్రకారం ఉదయం 11.30 గంటలకు రావల్సి ఉండగా, మధ్యాహ్నం 1.53కు చేరుకున్నారు. రైతులతో మాట్లాడిన అనంతరం ఆయన 2.15గంటలకు బస్సులో సూర్యాపేటకు బయలుదేరారు. మధ్యాహ్నం మూడు గంటల సమయంలో ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో పార్టీ ముఖ్యులతో కలిసి భోజనం చేశారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో కాసేపు విశ్రాంతి తీసుకున్నారు. సాయంత్రం ఐదు గంటలకు బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయానికి చేరుకుని ప్రెస్ మీట్ నిర్వహించారు. ఆలస్యం అవుతుండటంతో నల్లగొండ జిల్లా నిడమనూరు పర్యటన రద్దుచేసుకుని సాయంత్ర ఆరు గంటలకు కారులో రోడ్డు మార్గంలో ఎర్రవల్లికి బయలుదేరారు.



రాయిగిరి-మోత్కూరు మార్గమధ్యలో ఏర్పాటు చేసిన పోలీసులు చెక్‌పోస్టు, వాహనాలను తనిఖీలు చేస్తున్న పోలీసులు (ఫైల్)

సరిహద్దుల్లో హైఅలర్ట్

- లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో నిఘా
- ప్రత్యేకంగా చెక్‌పోస్టుల ఏర్పాటు
- పలుచోట్ల కేంద్ర బలగాల మోహరింపు
- డబ్బు, మద్యం సరఫరాకు అడ్డుకట్ట వేసేందుకు చర్యలు
- ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి వెళ్లే వాహనాల విస్తృత తనిఖీలు
- ఎనిమిది టీంలతో నిరంతరం పర్యవేక్షణ
- ఎన్నికలు ముగిసే వరకూ 24 గంటల తనిఖీలు

లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. త్వరలోనే నోటిఫికేషన్ జారీ కానుంది. షెడ్యూల్ విడుదలైనప్పటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి(ఎంసీసీ) కోడ్ అమల్లోకి వచ్చింది. పార్లమెంట్ ఎన్నికల బరిలో ఉన్న పార్టీలు, అభ్యర్థులు ఓటర్లను ప్రభావితం చేసేందుకు నగదు, వస్తువులు, తదితర నియోజకవర్గాలకు తరలిస్తుంటారు. ఈ నేపథ్యంలో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాల సరిహద్దుల్లో పోలీసులు డేగకన్ను వేశారు.

- (ఆంధ్రజ్యోతి-యాదాద్రి)

రానున్న ఎన్నికల్లో ప్రధాన పార్టీలు ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు పెద్దఎత్తున మద్యం, డబ్బులు పంపిణీ చేస్తున్నట్లు విస్తృతంగా ప్రచారం కొనసాగుతోంది. అభ్యర్థులు ముందస్తుగానే ఆయా ప్రాంతాలకు నగదుతోపాటు సామగ్రి తరలిస్తారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లా సరిహద్దుల్లో నిత్యం వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే పోలీసులు పంపుతున్నారు. మరోవైపు భువనగిరి, నల్లగొండ పార్లమెంట్ స్థానాలకు ప్రధాన పార్టీల అభ్యర్థులను ప్రకటించడంతో... ఇప్పటికే అన్నిపార్టీల నేతలు నియోజకవర్గంలో ప్రచారాన్ని ముమ్మరం చేస్తున్నారు. దీంతో ఆయా జిల్లాలోని నియోజకవర్గాల్లో నుంచి వెళ్లే, ఇతర జిల్లాల నుంచి వచ్చే వాహనాలను తనిఖీలను ముమ్మరంగా చేపడుతున్నారు. జిల్లా సరిహద్దులతోపాటు టోల్‌గేట్ల వద్ద నిఘాను పెంచారు.

నలుమూలల్లో చెక్‌పోస్టులు

జిల్లాలోని నలుమూలల్లోనూ పోలీసులు చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. రాచకొండ పోలీసు కమిషనరేట్ పరిధిలో ప్రస్తుతం ఎనిమిది చెక్ పోస్టులను ఏర్పాటు చేశారు. నల్లగొండ, సూర్యాపేట ఎస్పీల పరిధిలోని అంతరాష్ట్ర సరిహద్దుల్లో చెక్‌పోస్టులను ఏర్పాటుచేశారు. మద్యం, డబ్బు సరఫరా కాకుండా ఎన్నికల అధికారులు తగిన చర్యలు తీసుకుంటున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా నలుమూలల సరిహద్దుల్లో పోలీసుల పహారా పెరిగింది. రాజధాని నగరానికి వచ్చే చాలా వాహనాలు యాదాద్రి భువనగిరి, నల్లగొండ, సూర్యాపేట జిల్లాల నుంచే చేరుకుంటాయి. తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి నిత్యం అధిక సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. నేషనల్ హైవే-163, ఎన్‌హెచ్-165, హైదరాబాద్-నాగార్జునసాగర్ రోడ్డు, ఔటర్‌రింగ్‌తో పాటు అంతర్గత రహదారుల ద్వారా పలు జిల్లాల నుంచి నగర శివారుకు చేరుకుని, ఆయా జిల్లాలకు వెళ్తుంటారు. పలు రాష్ట్రాలు, జిల్లాల నుంచి వచ్చే వాహనాలతో రహదారులు నిత్యం రద్దీగా ఉంటాయి. ఇబ్రహీంపట్నం, జనగామ నియోజకవర్గాలు భువనగిరి లోక్‌సభ పరిధిలోకి వస్తాయి. ఈ నేపథ్యంలో జిల్లా సరిహద్దుల్లో రాచకొండ పోలీసు కమిషనరేట్, నల్లగొండ, సూర్యాపేట జిల్లా పోలీసులు అప్రమత్తమయ్యారు. జిల్లాలోని ప్రవేశించే మార్గాలపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. నగరం నుంచి జిల్లాలకు, ఇతర జిల్లాల నుంచి నగరానికి వచ్చే ప్రతీ వాహనాన్ని క్షుణంగా పరిశీలిస్తున్నారు.

వాహనాల తనిఖీలకు ప్రత్యేక బృందాలు

లోక్‌సభ నేపథ్యంలో చెక్‌పోస్టులతోపాటు నగదు తరలిస్తున్నట్లు అనుమానం ఉన్న వాహనాలను తనిఖీలకోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్ నిఘా బృందాలు విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నాయి. పలుచోట్ల కేంద్ర బలగాలు మోహరించాయి. అన్ని పార్టీలు కూడా భువనగిరి, నల్లగొండ నియోజకవర్గాలను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. ఈ నేపథ్యంలో ఇతర జిల్లాలు, ప్రాంతాల నుంచి మద్యం, డబ్బులు, ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వస్తువులు సరఫరా కాకుండా నిఘా పెంచారు. జిల్లావ్యాప్తంగా వాహనాల తనిఖీల కోసం దాదాపు ఎనిమిది టీంలు పనిచేస్తున్నాయి.

రూ.50వేలకు మించితే..

ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం వాహనాల్లో రూ.50 వేలకు పైగా ఉంటే, ఆ డబ్బులు వేటికి సంబంధించినవో పూర్తి వివరాలు తనిఖీ బృందాలకు తెలియజేయాలి. వీటికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను కూడా చూపాలి. రూ.10లక్షల వరకు నగదు దొరికితే తనిఖీ బృందాలు ఆదాయ పన్ను శాఖ అధికారులకు సమాచారం ఇస్తారు. వేసవి సెలవుల సందర్భంగా పలు జిల్లాలకు వెళ్లి వస్తున్న వాహనాలను తనిఖీలు చేపట్టి, వారి వివరాలను నమోదు చేసుకుంటున్నారు. వాహనాల్లో ఉన్న బ్యాగులను క్షుణంగా పరిశీలిస్తున్నారు. ఎన్నికలు ముగిసే వరకూ 24గంటల పాటు తనిఖీ బృందాలు అన్ని ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించనున్నాయి. జిల్లాలోని పలు చెక్‌పోస్టులతోపాటు ప్రధాన బస్టాండ్లలో తనిఖీలు చేపట్టేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనలు అతిక్రమించి ఎలాంటి వస్తువులు సరఫరా అయినా పట్టుకునేందుకు పోలీసు నిఘా కట్టుదిట్టం చేస్తున్నారు.

పార్లమెంట్ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ భూస్థాపితం

తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు



అర్వపల్లిలో మాట్లాడుతున్న తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు

అర్వపల్లి, మార్చి 31: పార్లమెంట్ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ పార్టీ భూస్థాపితం కావడం ఖాయమని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. మండలకేంద్రంలో ఆదివారం జరిగిన కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ సీఎం కేసీఆర్ మాయమాటలను ప్రజలు ఎవరూ నమ్మే పరిస్థితిలేదన్నారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ ద్వారా గోదావరి జలాలు అందిస్తున్నా, పార్లమెంట్ ఎన్నికల డ్రామాతో పొలాలు ఎండిపోయాయని చూడాడనికి రావడం సిగ్గు చేటన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆరు గ్యారెంటీలు అమలు చేస్తుంటే ఓర్వలేక మాజీ సీఎం కేసీఆర్ నీళ్ల పేరుతో డ్రామాలు చేస్తూ విమర్శించడం తగదన్నారు. విద్యుత్ శాఖలో రూ.80కోట్ల అప్పు చేసి కుంభకోణాల్లో ఇర్కుకుపోయి నీతి మాటలు మాట్లాడటం ఎంత వరకు సమంజసమని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఒక్క సీటు కూడా గెలవదన్నారు. తుంగతుర్తి నియోజకవర్గంలో బిక్కేరు వాగులో మూడు కిలో మీటర్ల వరకు రోడ్లు వేసి ఇసుక దోపిడీ చేసి కోట్ల రూపాయలు దండుకున్నారని ఆరోపించారు. మూసీ పరీవాహక ప్రాంతంలో ఇసుక తోడడంతో పంటలకు నీళ్ల అందక ఎండిపోతున్నాయన్నారు. కేసీఆర్ రాజరిక పరిపాలనను ప్రజలు అంతం చేసినా ఇంకా బుద్ధి రాలేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రజాపరిపాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. గోదావరి జలాలు వారబందీతో నీళ్లు విడుదల చేస్తున్నామన్నారు. ఫోన్ ట్యాంపింగ్‌లో కొంత మంది బీఆర్ఎస్ నాయకులు జైలుకు వెళ్ల డం ఖాయమన్నారు. గ్రామీణ ప్రాంతాలల్లో పదేళ్లలో ఎక్కడైనా ఒక ఇల్లు కట్టించారని అని ప్రశ్నించారు. తుంగతుర్తి నియోజక వర్గంలో గతేడాది వడగండ్ల వర్షంతో రూ.5కోట్ల వరకు రైతులు పంట లు నష్టపోతే గత ప్రభుత్వం రైతులకు ఒక్క పైసా నష్టరిహారం ఇచ్చినట్లు నిరూపిస్తే దేనికైనా సిద్ధమన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు దరూరి యోగనందచార్యులు, నాయకులు అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, అభిషేక్‌రెడ్డి, మోరపాక సత్యం, నర్సింగ్ శ్రీనివాసగౌడ్, ఇందుర్తి వెంకట్‌రెడ్డి, భైరబోయిన మహరాజు, సిగ ననీర్‌గౌడ్, జీడి వీరస్వామి, రాంబాబు, జేర్రిపోతుల లక్ష్మణ్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావాలి

తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి



బాస్కెట్‌బాల్ క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న పటేల్ రమేష్‌రెడ్డి

సూర్యాపేటటౌన్, మార్చి 31: క్రీడాకారులు జిల్లాకు జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావాలని తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో సూర్యాపేట బాస్కెట్ బాల్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉమ్మడి నల్లగొండ స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో మానసిక, శారీరక దృఢత్వం పెరుగుతుందన్నారు. సూర్యాపేట జిల్లాకేంద్రంలో త్వరలో రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలు నిర్వహించేందుకు కృషి చేస్తానని తెలిపారు. అమెరికా వంటి అభివృద్ధి చెందుతున్న దేశాల్లో బాస్కెట్ బాల్ క్రీడకు అదరణ ఉందని, దేశంలో సైతం అదిశగా యువత ఆసక్తి పెంచుకోవాలన్నారు. విద్యార్థులు చదువులతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట బాస్కెట్‌బాల్ క్లబ్ కార్యదర్శి ఫరూఖ్, నాయకులు గట్టు శ్రీనివాస్, కౌన్సిలర్లు వెలుగు వెంకన్న, షఫీ ఉల్లా, రమేష్, మంత్రి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో ఘనంగా ఈస్టర్ వేడుకలు



చివ్వెంలలో ప్రార్థనలు చేస్తున్న పాస్టర్ దుర్గం ప్రభాకర్

తిరుమలగిరి రూరల్, చివ్వెంల, నేరేడుచర్ల, హుజూర్‌నగర్, మార్చి 31: జిల్లా వ్యాప్తంగా ఈస్టర్ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఏసుక్రీస్తుకు శిలువ వేసిన తర్వాత మూడవ రోజును ప్రజలు ఈస్టర్ పండుగగా జరుపుకుంటారు. తిరుమలగిరి మండలంలోని తాటిపాముల, తొండ, గుండెపురి, జలాల్‌పురం గ్రామాల్లో కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో పాస్టర్ పురుషోత్తం, భాస్కర్, శేఖర్, అనంతి, రంజిత్, సోమయ్య, అమృతి, తదితరులు పాల్గొన్నారు. చివ్వెంల మండలంలోని ఖాశీంపేటలోని బెతేస్థ మిని స్ట్రీస్‌లో జరిగిన ఈస్టర్ వేడుకలు నిర్వహించారు. మరణంపై ఏసుక్రీస్తు గెలిచిన విజయో త్సవమే ఈస్టర్ పండుగని జిల్లా పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దుర్గం ప్రభాకర్ అన్నారు. ఏసు క్రీస్తు చూపిన మార్గం ఆచరణీయమని తెలిపారు. కార్యక్రమంలో దుర్గం కరుణ, హోసన్న, మీసాల తీతు, నాగరాజు, యేసుపాదం, బాబు, ఉపేందర్, రాజు, పేతురు అబ్రహం, కిరణ్, దావీదు, భాస్కర్ పాల్గొన్నారు. నేరేడుచర్ల మండలంలోని దిర్శించర్ల బాప్టిస్ట్ చర్చిలో పాస్టర్ శ్యామ్ డేవిడ్ ఆధ్వర్యంలో ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ రాపోలు నర్సయ్య, పెడలా, సోమయ్య, బాబు, రమేష్, శ్రీనివాస్, నాగయ్య, సురేష్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు. హుజూర్‌నగర్, పట్టణంలో కొత్త బస్టాండ్ నుంచి పాతబస్టాండ్ వరకు రన్‌ఫర్ జీసెస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్‌చైర్మన్ సంపత్‌రెడ్డి మాట్లాడుతూ క్రైస్తవుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి పాటుపడుతుందన్నారు. కార్యక్రమంలో సామ్యేలు, సుధాకర్, పౌల్, వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.



హుజూర్‌నగర్‌లో రన్‌ఫర్ జీసెస్ కార్యక్రమంలో పాల్గొన్న క్రైస్తవులు

కొనసాగుతున్న నాటక పోటీలు



నడ(క)త సాంఘిక నాటకంలోని ఓ ఘట్టం

మిర్యాలగూడ టౌన్, మార్చి 31: తెలంగాణ భాష సాంస్కృతిక శాఖ, సాంస్కృతిక కళాకేంద్ర సంయుక్త ఆధ్వర్యంలో నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మినీ రవీంద్రభారతిలో నిర్వహిస్తున్న జాతీయస్థాయి పద్య, సాంఘిక నాటక పోటీలు కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా రెండోరోజు ప్రదర్శించిన ఉన్నది ఒకటే జీవితం, నడ(క)త సాంఘిక నాటికలు చక్కటి సందేశాన్నిచ్చాయి. ఇక పద్య నాటక విభాగంలో కళాకారులు ప్రదర్శించిన మహావీర బభ్రువాహన నాటిక ఆద్యంతం ఆసక్తికరంగా సాగగా, మహారాణి రుద్రమదేవి నాటకం సుపరిపాలన ఎలా ఉంటుందో చూపించింది. ఇరువిభాగాల్లో కళాకారులు తమ పాత్రల్లో జీవించి ప్రేక్షకులను మైమరిపించారు. ఆయా కార్యక్రమాల్లో కళాకేంద్ర వ్యవస్థాపకుడు తడకమళ్ల పూర్ణచందర్, అధ్యక్షుడు బోయినపల్లి భుజంగరావు, నాయకులు పులి కృష్ణమూర్తి, పుల్లాభట్ల లక్ష్మీనారాయణశర్మ, గ్యార సాయిలు, పరిమి రామావతారం, ఉపేందర్, శ్రీనివాసరావు, రాంరంగారావు, బాబురావు, రాఘవయ్య, బాపనయ్య, వేణు, వెంకటరెడ్డి, రఘు తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడికి రిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ

నల్లగొండ, మార్చి 31: దొంగతనం కేసులో నిందితుడిని రిమాండ్‌కు పంపించినట్లు వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ తెలిపారు. జిల్లా కేంద్రంలోని దేవరకొండ రోడ్డు సూర్యవంశీ కాలనీలో నివాసం ఉంటున్న కూసుకుంట్ల అంజిరెడ్డి ఇంటికి తాళం వేసి మార్చి 23న చౌటుప్పల్‌లో జరిగిన ఫంక్షన్‌కు వెళ్లాడు. తిరిగి 25వ తేదీన మధ్యాహ్నం 1.30 గంటలకు ఇంటికి వచ్చి చూసే సరికి చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అంజిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోలీసులు విచారణ చేపట్టారు. ఆదివారం ఉదయం ఎస్‌ఐ ఎన్.సందీప్ రెడ్డి సిబ్బందితో కలిసి పెట్రోలింగ్ చేస్తున్న సమయంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న రుద్రాక్షి శ్రీనును అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా ఈ దొంగతనం వెలుగులోకి వచ్చిందన్నారు. కనగల్ మండలం జి.యడవల్లికి చెందిన శ్రీను సూర్యవంశీ కాలనీలోని అంజిరెడ్డి ఇంటి తాళాన్ని పగుల గొట్టి రూ.50 వేల నగదు, 2 తులాల బంగారం, 25 తులాల మూడు జతల వెండి పట్టీలు, వెండి కుందులు, ఒక జత బంగారు చెవి కమ్మలు చోరీ చేసినట్లు తెలిపారు. శ్రీను నేరాన్ని ఒప్పుకున్నాడని అతడి నుంచి రూ.40వేల నగదు, 2 తులాల బంగారం, వెండి కుందులను రికవరీ చేసి రిమాండ్ తరలించినట్లు ఆయన తెలిపారు.

'సన్'డే

● *ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 42.4 డిగ్రీలుగా నమోదు*

నల్లగొండ, మార్చి 31: ఉమ్మడి నల్లగొండ జిల్లాలో రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. వడగాడ్పుల ధాటికి వృద్ధులు అల్లాడి పోతున్నారు. ఆదివారం ఆడుకునేందుకు కూడా చిన్నారులు ఇంటి నుంచి బయటకు రాలేదు. ఇళ్లలో వేడికి తట్టుకోలేక, బయటకు వెళ్లే పరిస్థితి లేక సామాన్య ప్రజలు ఇంట్లోనే ఉడికిపోతున్నారు. ఎండ తీవ్రతతో ఉదయం నుంచే రహదారులపై వాహనాలు కనిపించలేదు. సాయంత్రం ఆరు గంటల తర్వాత బయటకు వెళ్తున్నారు. నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలంలో అత్యధికంగా 42.4 డిగ్రీలు, అత్యల్పంగా మర్రి గూడ మండలంలో 36.5 డిగ్రీలు, యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలం మల్యాలలో అత్యధికంగా 40.8, బీబీనగర్ మండలంలో అత్యల్పంగా 36.9డిగ్రీలు, సూర్యాపేట జిల్లా మోతె మండలం మామిళ్లగూడెంలో అత్యధికంగా 41.1 డిగ్రీలు, అత్యల్పంగా తుంగతుర్తి మండలంలో 34.9 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

ఎన్టీపీసీ 'రెండో దశ'తో ఒప్పందానికి నో!

2400 మెగావాట్ల ప్లాంట్ నిర్మాణం.. కరెంటు కొనుగోలుకు సర్కారు విముఖత

- విద్యుత్తు వచ్చేది 5-8 ఏళ్ల తర్వాతే!
- అప్పటికి రూ.8-9 మధ్య యూనిట్ ధర
- ఒప్పందం చేసుకుంటే రాష్ట్రానికి గుదిబండే!



హైదరాబాద్ మార్చి 31 (ఆంధ్రజ్యోతి): రామగుండంలో ఎన్టీపీసీ ఆధ్వర్యంలో నిర్మించతలపెట్టిన రెండో విడత తెలంగాణ సూపర్ థర్మల్ విద్యుత్తు కేంద్రం నుంచి కరెంటు కొనుగోలు చేస్తే రాష్ట్రానికి పెనుభారంగా మారే ప్రమాదం ఉందని ప్రభుత్వం అంచనా వేసింది. 2400 మెగావాట్ల సామర్థ్యంతో తలపెట్టిన ఈ విద్యుత్కేంద్రం నిర్మాణానికి ఐదు నుంచి ఎనిమిదేళ్లు పడుతుందని.. అప్పటికి ఇక్కడి నుంచి ఉత్పత్తయ్యే విద్యుత్తు ధర యూనిట్‌కు రూ.8-9కి ఎగబాకుతుందని రాష్ట్ర ఇంధన శాఖ అంచనాకు వచ్చింది. బహిరంగ మార్కెట్లో ఇంతకంటే తక్కువ ధరకే విద్యుత్తు లభిస్తుండగా, భారీ ధరతో 25 ఏళ్ల పాటు కరెంటు కొనుగోలుకు దీర్ఘకాలిక ఒప్పందం చేసుకుంటే రాష్ట్ర ప్రజలపై రూ.వేల కోట్ల అనవసర భారం పడుతుందని తేల్చింది. ఈ నేపథ్యంలో ఎన్టీపీసీతో ఎలాంటి విద్యుత్తు కొనుగోలు ఒప్పందం చేసుకోరాదని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయానికి వచ్చింది. త్వరగా ఒప్పందం చేసుకోకపోతే ఇతర రాష్ట్రాలతో అగ్రిమెంట్ చేసుకుని విద్యుత్కేంద్రం నిర్మిస్తామని ఎన్టీపీసీ ఇటీవల అల్టిమేటం జారీ చేయడంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ వ్యవహారంపై సమీక్షించి, కొనుగోలు ఒప్పందం చేసుకోరాదని నిర్ణయించింది. రాష్ట్ర విభజన అనంతరం తెలంగాణలో విద్యుత్తు కొరతను తీర్చడానికి ఎన్టీపీసీ ఆధ్వర్యంలో 4000 మెగావాట్ల థర్మల్ విద్యుత్తు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని పునర్విభజన చట్టం-2014లో కేంద్రం హామీ ఇవ్వగా, తొలి విడత కింద 1600 మెగావాట్ల విద్యుత్కేంద్రం నిర్మాణాన్ని ఇటీవల ఎన్టీపీసీ పూర్తి చేసింది. రెండో విడత కింద 2400 మెగావాట్ల ప్లాంట్లను నిర్మించాల్సి ఉంది. తొలి విడత విద్యుత్తు ధర యూనిట్‌కు రూ.5.90 ఉండగా, ఒప్పందం కారణంగా కొనుగోలు చేయక తప్పని పరిస్థితి ఉంది.

గత సర్కారు తప్పిదమే..!

పదేళ్లలో గత ప్రభుత్వం చేసిన పాపాలు రాష్ట్రంలో విద్యుత్తు సంస్థలకు గుదిబండగా మారాయని కాంగ్రెస్ సర్కారు ఆరోపిస్తున్న సంగతి తెలిసిందే. రెండో విడతలో 2400 మెగావాట్ల ప్లాంట్ నిర్మాణానికి ఎన్టీపీసీతో ఒప్పందం చేసుకోకుండా 10 ఏళ్లపాటు జాప్యం చేయడమే దీనికి కారణమని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. అప్పట్లో ఒప్పందం చేసుకొని ఉంటే ఇప్పటికే నిర్మాణం పూర్తయి, తక్కువ ధరకు రాష్ట్రానికి కరెంటు వచ్చేదని చెబుతున్నాయి. ఇప్పుడు ఒప్పందం చేసుకుంటే భవిష్యత్తులో రాష్ట్రానికి గుదిబండగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

కొత్త థర్మల్ ప్లాంట్లకు స్వస్తి..

దామరచర్లలో తెలంగాణ జెన్‌కో నిర్మిస్తున్న 4000 మెగావాట్ల యాదాద్రి థర్మల్ విద్యుత్కేంద్రం నాలుగేళ్ల కిందే పూర్తి కావాల్సి ఉండగా, ఇంకా పనులు సాగుతున్నాయి. జాప్యంతో ప్రాజెక్టు నిర్మాణ వ్యయం పెరిగింది. కాలం చెల్లిన సబ్‌క్రిటికల్ టెక్నాలజీతో నిర్మించిన భద్రాద్రి విద్యుత్తు కేంద్రం వ్యయం సైతం భారీగా పెరగడంతో దాని విద్యుత్తు ధరలూ పెరిగిపోయాయి. యాదాద్రి, భద్రాద్రి ప్లాంట్ల నిర్మాణంలో తీవ్ర అవినీతి ఆరోపణలు రావడంతో కాంగ్రెస్ సర్కారు న్యాయ విచారణకు ఆదేశించింది. ఈ నేపథ్యంలో మళ్లీ కొత్త థర్మల్ విద్యుత్తు ప్లాంట్ల నిర్మాణం జోలికి వెళ్లవద్దని ప్రభుత్వం ఓ అభిప్రాయానికి వచ్చినట్లు తెలిసింది. ప్రత్యామ్నాయంగా మార్కెట్‌లో రూ.2-4కు యూనిట్ చొప్పున లభిస్తున్న పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని పెంచుకోవాలని నిర్ణయించింది. సౌర, జల, పవన, పంప్డ్ స్టోరేజీ, బ్యాటరీ స్టోరేజ్ విద్యుత్తుపై దృష్టిపెట్టాలని నిర్ణయించింది.

బాసర ఆలయంలో విజిలెన్స్ తనిఖీలు

(మొదటిపేజీ తరువాయి)

సెంట్రల్ స్టోర్‌లో ఉన్న సరుకులను పరిశీలించారు. సరుకుల నాణ్యత, బ్రాండ్‌లు రికార్డుల్లో పేర్కొన్న ప్రకారం ఉన్నాయో లేదో సరి చూశారు. టెండరులో ఉన్న బ్రాండ్‌లు, క్వాలిటీ కాకుండా ఇతర సరుకులు ఉన్నట్లు, రికార్డుల్లో ఉన్న సరుకులకు, స్టోర్ రూమ్‌లో ఉన్న సరుకుల లెక్కలకు తేడాలు ఉన్నట్లు గుర్తించారు. అనంతరం ఆలయ కార్యాలయంలో దాదాపు 5 గంటల పాటు రికార్డులను పరిశీలించారు. సరుకుల కొనుగోళ్లకు సంబంధించిన ప్రతీ బిల్లును తనిఖీ చేశారు. జాబితాలో దాదాపు 70 శాతానికి పైగా సరుకుల ధరలు మార్కెట్ రేటు కంటే ఎక్కువగా ఉన్నట్లు సమాచారం. ఈ విషయంలో ఆలయ అధికారులపై విజిలెన్స్ అధికారి అసహనం వ్యక్తం చేసినట్టు తెలిసింది. ఎంఆర్‌పీ కూడా చూడకుండా టెండరును ఎలా నిర్ధారణ చేస్తారని అధికారులను ప్రశ్నించారు. విజిలెన్స్ అధికారులు ఆకస్మికంగా రావడంతో ఆలయ ఈవో హైదరాబాద్ నుంచి హుటాహుటిన బాసర వచ్చారు. కాగా, విజిలెన్స్ అధికారుల ఇచ్చే నివేదిక ఆధారంగా దేవాదాయ శాఖ చర్యలు తీసుకుంటుంది.





పంట నష్టం పరిహారమేదీ?

ఏడాదిగా ఎదురుచూస్తున్న రైతన్నలు.. గతేడాది మార్చి, ఏప్రిల్‌లో 1,51,545 ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు

- ఎకరాకు రూ.10 వేల పరిహారం ఇస్తామన్న గత ప్రభుత్వం
- నేటికీ అందని రెండో విడత పంట నష్టపరిహారం
- కాంగ్రెస్ ప్రభుత్వమైనా ఇవ్వాలని రైతుల వేడుకోలు



జగిత్యాల జిల్లా మోరపల్లిలో నేలవాలిన మొక్కజొన్న (ఫైల్)

జనగామ/జగిత్యాల, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): అన్నదాతలు ఆరుగాలం శ్రమించి సాగు చేసిన పంటలు అకాలవర్షానికి నేలపాలయ్యాయి. వడగళ్ల వానలు, ఈదురుగాలులు పంటలను అతలాకుతలం చేశాయి. రైతన్న వేదనను చూసిన ప్రభుత్వం.. వారికి పంట నష్టపరిహారం ఇచ్చి ఆదుకుంటామని హామీ ఇచ్చింది. నష్టపోయిన పంటలకు ఎకరాకు రూ.10 వేల చొప్పున ఇస్తామని చెప్పింది. కానీ, ఏడాది కాలం గడిచిపోతున్నా.. ఇప్పటికీ రైతులకు పరిహారం అందలేదు. ఇంకా వారికి ఎదురుచూపు తప్పలేదు. గతేడాది మార్చి, ఏప్రిల్ నెలల్లో కురిసిన అకాల వర్షాలకు రాష్ట్రవ్యాప్తంగా అధిక విస్తీర్ణంలో వరి, మామిడి, మొక్కజొన్న తదితర పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. కోత దశకు వచ్చిన పంట కావడంతో వడగళ్ల దెబ్బకు గింజలన్నీ నేలరాలి రైతులకు కడగళ్లను మిగిల్చాయి. అధికారుల ద్వారా పంట నష్టం వివరాలను తెప్పించుకున్న నాటి ప్రభుత్వం.. నష్టపోయిన రైతులందరికీ పరిహారం చెల్లిస్తామని చెప్పినా.. కేవలం మార్చి నెలకు సంబంధించిన పరిహారాన్ని మాత్రమే రైతుల ఖాతాల్లో జమ చేసింది. అయితే మార్చి నెలలో జరిగిన నష్టం కన్నా ఏప్రిల్‌లో రెట్టింపు నష్టం సంభవించింది. కానీ, ఏప్రిల్‌లో జరిగిన నష్టానికి సంబంధించిన పరిహారాన్ని మాత్రం రైతులకు నేటికీ ఇవ్వలేదు. ఇందుకోసం రూ.151.54 కోట్లు విడుదల చేస్తున్నట్లు ఆనాడు ప్రకటించినా రైతుల ఖాతాల్లో మాత్రం జమ కాలేదు.

రెండు లక్షల ఎకరాల్లో పంట నష్టం..

రాష్ట్రవ్యాప్తంగా సుమారు 2.28 లక్షల ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లిందన్న విషయాన్ని నాడు ఖమ్మం జిల్లాలో పంటల పరిశీలన సందర్భంగా అప్పటి సీఎం కేసీఆర్ ప్రకటించారు. ఇందులో మొక్కజొన్న 1,29,446 ఎకరాలు, వరి 72,709 ఎకరాలు, మామిడి 8,865 ఎకరాల్లో నష్టపోయిందని పేర్కొన్నారు. గతేడాది మార్చి 23న ఖమ్మం, వరంగల్, మహబూబాబాద్, కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల్లో కేసీఆర్ పర్యటించి నష్టపోయిన పంటలను పరిశీలించారు. ఆ తర్వాత రాష్ట్రవ్యాప్తంగా పంటనష్టం జరిగిన 26 జిల్లాల్లో వ్యవసాయాధికారులు సర్వే నిర్వహించి 1,51,545 ఎకరాల్లో నష్టం జరిగినట్లు తేల్చారు. దీనికి సంబంధించి ఎకరానికి రూ.10 వేల చొప్పున రూ.151.54 కోట్లు విడుదల చేస్తున్నట్లు గతేడాది జూన్‌లో కేసీఆర్ సర్కారు ప్రకటించింది. మొత్తం 1,30,988 మంది రైతులు పరిహారానికి అర్హులుగా పేర్కొంది. అయితే మార్చి నెల పరిహారాన్ని మాత్రమే రైతుల ఖాతాల్లో జమ చేసింది. కాగా, జగిత్యాల జిల్లాలో గతేడాది మార్చి, ఏప్రిల్‌తోపాటు జూలైనూ కలిపి 73,686 ఎకరాల్లో వివిధ పంటలు దెబ్బతిన్నాయి. ఇందులో మార్చిలోనే 6,199 ఎకరాల్లో పంటలు దెబ్బతినగా.. కేవలం 532 ఎకరాలకే పరిహారం చెల్లించారు. ఏప్రిల్‌లో 52 వేల ఎకరాల్లో, జూలైలో భారీ వర్షాలకు 15,487 ఎకరాల్లో పంటనష్టం వాటిల్లగా.. ఇప్పటివరకు పరిహారం ఇవ్వలేదు. మొత్తంగా రెండో విడతకు సంబంధించి 20,160 మంది రైతులకు పరిహారం కింద రూ.36.69 కోట్లు చెల్లించాల్సి ఉంది.

ఆర్థిక శాఖలో పెండింగ్..

రెండో విడత పంట నష్టం పరిహారానికి సంబంధించిన నిధులు ఆర్థికశాఖ వద్ద పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. గత ప్రభుత్వంలో 2 విడతలకు సంబంధించి రూ.151.54 కోట్లు విడుదల చేయగా వాటికి ఫైనాన్స్ క్లియరెన్స్ లభించలేదని అధికారులు చెబుతున్నారు. క్లియరెన్స్ వస్తే నేరుగా రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అయ్యే అవకాశముంది. దీనిపై కొత్త ప్రభుత్వం దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు.

ఏడు ఎకరాల్లో పంట నష్టపోయాను



గతేడాది యాసంగిలో ఏడెకరాల్లో వరి పంట సాగు చేస్తే వడగళ్లు, ఈదురుగాలుల కారణంగా పంటంతా నాశనమైంది. చేతికొచ్చిన గింజలన్నీ చేలోనే రాలిపోయి ఏమీ చేతికిరాలేదు. పంట సాగుకు పెట్టిన పెట్టుబడి కూడా రాలేదు. అధికారులు సర్వే చేసి పంట నష్ట పరిహారం అందిస్తామని చెప్పారు. కానీ, ఏడాది దాటుతున్నా ఒక్క పైసా పరిహారం రాలేదు. అధికారులను అడిగితే ప్రభుత్వం వద్దే పైసలు ఆగిపోయాయని చెబుతున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి పరిహారాన్ని అందించాలి.

\- గొడ్డేటి రాజు, గానుగుపహాడ్, జనగామ జిల్లా

రేపు తిరుమలలో వీఐపీ బ్రేక్ దర్శనం రద్దు

తిరుమల, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో మంగళవారం శ్రీవారి వీఐపీ బ్రేక్ దర్శనాలను టీటీడీ రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ నెల తొమ్మిదో తేదీన ఉగాది ఆస్థానం సందర్భంగా మంగళవారం శ్రీవారి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం (ఆలయ శుద్ధి) నిర్వహించనున్నారు. ఉదయం 6 నుంచి 11 గంటల వరకు ఈ కార్యక్రమం జరగనుండటంతో వీఐపీ బ్రేక్‌ను టీటీడీ రద్దు చేసింది. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఇప్పటికే ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలను రద్దు చేసిన విషయం తెలిసిందే. ప్రొటోకాల్ పరిధిలో స్వయంగా వచ్చే వీఐపీలకు, ట్రస్టు దాతలకు మాత్రమే బ్రేక్ దర్శన టికెట్లను జారీ చేస్తున్నారు. కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నేపథ్యంలో వీటిని కూడా రద్దు చేస్తున్నట్టు టీటీడీ తెలిపింది. కాగా, ఎన్నికల కోడ్ నేపథ్యంలో తిరుమల శ్రీవారి శ్రీవాణి ట్రస్టుకు గడిచిన 15 రోజుల్లో రూ.22.75 కోట్ల విరాళాలు అందాయి. ఎన్నికల కోడ్ కారణంగా మార్చి 16వ తేదీ నుంచి వీఐపీ బ్రేక్ సిఫారసు లేఖలను టీటీడీ రద్దు చేసింది. ఈ క్రమంలో శ్రీవాణి ట్రస్టుకు రూ.10వేల విరాళం అందించి రూ.500 బ్రేక్ దర్శన టికెట్లను కొనుగోలు చేసే వారి సంఖ్య పెరిగింది.

బెంగాల్‌లో తుఫాను బీభత్సం

- నలుగురి మృతి, 200 మందికి గాయాలు

కలకత్తా, మార్చి 31: పశ్చిమ బెంగాల్‌లోని జల్పాయిగురి జిల్లాలో ఈదురుగాలులతో కూడిన భారీ తుఫాను కారణంగా పలు ఇళ్లు ధ్వంసమయ్యాయి. చెట్లు, హోర్డింగులు, కరెంటు స్తంభాలు నేల కూలాయి. పలు వాహనాలు తిరగబడ్డాయి. దాంతో నలుగురు మృతి చెందగా, 200 మందికిపైగా గాయపడ్డారు. మృతి చెందిన వారికి పశ్చిమ బెంగాల్ సీఎం మమత సానుభూతి తెలిపారు. వారి కుటుంబసభ్యులకు తగిన పరిహారం అందజేస్తామని ప్రకటించారు. గాయపడిన వారికి ప్రభుత్వమే చికిత్స అందిస్తుందని హామీ ఇచ్చారు. కల్లోలిత ప్రాంతాల్లో తగిన రక్షణ చర్యలు చేపట్టవలసిందిగా అధికారులను ఆదేశించారు. బెంగాల్ వరదల్లో మరణించిన వారికి ప్రధాని మోదీ సానుభూతి ప్రకటించారు.

జగన్ నిర్వాకంతో ఏపీ ఖజానా ఖాళీ

అప్పు తీసుకోకపోతే పూటైనా గడవదు... పింఛన్లు ఇవ్వడానికి డబ్బు లేక టీడీపీపై నెపం మోపే యత్నం: చంద్రబాబు

- మార్కాపురం, ఎమ్మిగనూరు, బాపట్లల్లో భారీ బహిరంగ సభలు



బాపట్ల/కర్నూలు/ఒంగోలు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): సీఎం జగన్ నిర్వాకంతో రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయి ఖజానా ఖాళీ అయిందని టీడీపీ అధినేత చంద్రబాబు విమర్శించారు. అప్పు తీసుకోకపోతే పూటగడవని స్థితికి ప్రభుత్వం చేరుకుందన్నారు. ప్రస్తుతం పింఛన్లు ఇవ్వడానికి కూడా డబ్బు లేక.. ఆ నెపం టీడీపీపై మోపే ప్రయత్నం చేస్తున్నాడని ధ్వజమెత్తారు. ప్రజాగళం యాత్రలో భాగంగా ఆదివారం ఆయన ప్రకాశం జిల్లా మార్కాపురం, కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు, బాపట్ల జిల్లా కేంద్రంలో జరిగిన భారీ బహిరంగ సభల్లో ప్రసంగించారు. జగన్ ఈ ఐదేళ్లలో రూ.13 లక్షల కోట్ల అప్పు చేశాడని, వాటిని ఆయన రోత పత్రిక తీరుస్తుందా.. భారతీ సిమెంట్స్ తీరుస్తుందా అని నిలదీశారు. ఈ సీఎం నమ్మించి గొంతు కోసే రకమని దుయ్యబట్టారు. రాయలసీమ బిడ్డనని చెప్పుకొంటూ ఈ ప్రాంతానికి ఏమీ చేయలేదన్నారు. ఈ ప్రాంతంలో 52 అసెంబ్లీ స్థానాలుంటే గత ఎన్నికల్లో 49 మంది వైసీపీ ఎమ్మెల్యేలను గెలిపించారని.. కానీ ఒక్క పనైనా చేశాడా అని ప్రశ్నించారు. ఐదేళ్లలో ఒక్క ఇరిగేషన్ ప్రాజెక్టయినా పూర్తి చేశాడా.. కర్నూలు ప్రాంతానికి కనీసం నీళ్లు ఇవ్వాలన్న ఆలోచనైనా చేశాడా.. పేదలు, యువత భవిష్యత్ గురించి ఆలోచించాడా అని నిలదీశారు. ఆయన రాయలసీమ ద్రోహి అని.. ఒక్క ఓటు వేసినా మన నెత్తిన మనమే చెత్తవేసుకున్నట్లు అవుతుందని హెచ్చరించారు. బటన్ నొక్కి ప్రజల సంక్షేమమని ప్రతిరోజూ చెబుతున్నాడని.. అలాగైతే మద్య నిషేధం, జాబ్ కేలెండర్, డీఎస్సీలపై ఎందుకు నొక్కలేదని ప్రశ్నించారు. తొమ్మిదిసార్లు విద్యుత్ చార్జీలు పెంచాడని.. ఆర్టీసీ, పెట్రోలు, డీజిల్, నిత్యావసరాల ధరలు పెరిగి జనం అల్లాడుతుంటే.. వాటిని తగ్గించే బటన్ ఎందుకు నొక్కలేదన్నారు. 'సంక్షేమం పేరుతో రూ.10 ఇచ్చి రూ.100 లాగేసుకుంటున్నాడు. బటన్ నొక్కి ఇచ్చింది ఎంత? ప్రజల నుంచి నొక్కింది ఎంత? అందులో మీరు బొక్కింది ఎంత' అని నిలదీశారు. రాష్ట్ర విభజన సమయంలో ఏపీ కన్నా తెలంగాణలో తలసరి ఆదాయం 35 శాతం అధికంగా ఉంటే 2014-19లో దానిని 27 శాతానికి తగ్గేలా చేశామని.. జగన్ వచ్చాక తేడా 45 శాతానికి పెరిగిందని.. బటన్ నొక్కి పేదల సంక్షేమం చేస్తే ఇంత వ్యత్యాసం ఎందుకొచ్చిందని ప్రశ్నించారు. ఐదేళ్లుగా రాష్ట్రాన్ని పట్టి పీడిస్తున్న శని మే 13తో విరగడైపోతుందని చెప్పారు.

ఫ్యాన్ చెత్తబుట్టలోకే..

ఈ ఎన్నికల్లో ఫ్యాన్ ముక్కలై చెత్తబుట్టలో పడేయడం ఖాయమని చంద్రబాబు అన్నారు. "ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకూడదని, విధ్వంసకర వైసీపీ పాలన అంతం కావాలన్న ఉద్దేశంతో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి పొత్తుకు ఆద్యుడు పవన్. మూడు పార్టీలు కలవడం మాకోసం, మా రాజకీయాల కోసం కాదు. ప్రజలు గెలవాలి, ఏపీ బాగుండాలన్న ఉద్దేశంతోనే! ఈ విషయాన్ని ప్రజలంతా గుర్తించాలి. సంక్షేమంతో పాటు అభివృద్ధి చేయాలంటే కేంద్రం సహకారం అవసరం. రాష్ట్ర ప్రయోజనాల కోసమే పొత్తు పెట్టుకున్నాం. మేం కలిస్తే జగన్ ఎందుకు కంగారు పడుతున్నాడు? ముస్లింలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నాడు. ఎన్డీయే అధికారంలోకి వస్తే ముస్లిం రిజర్వేషన్లు పోతాయని రెచ్చగొడుతున్నారు" అని మండిపడ్డారు.



కూటమి విజయం ఖాయం: పవన్

- వైసీపీ దోపిడీని అరికడితే అన్ని పథకాలకు నిధులు వస్తాయి
- పింఛన్లు అందేలా చూడండి.. 3 పార్టీల నేతలకు జనసేనాని పిలుపు



పిఠాపురం, మార్చి 31: రాష్ట్రంలో వచ్చే ఎన్నికల్లో విజయం సాధించి రాబోయేది జనసేన-టీడీపీ-బీజేపీ కూటమి ప్రభుత్వమేనని జనసేన అధినేత పవన్ కల్యాణ్ పునరుద్ఘాటించారు. భారీ మెజారిటీతో సీట్లు గెలవబోతున్నామని తెలిపారు. ప్రస్తుతం అమలు చేస్తున్న ఏ సంక్షేమ పథకం ఆగిపోదని.. ఈ విషయాన్ని స్పష్టంగా అందరికీ తెలియజేయాలని మూడు పార్టీల నేతలకు పిలుపిచ్చారు. ఆదివారం కాకినాడ జిల్లా పిఠాపురం మండలం కుమారపురం గోకులం గ్రాండ్‌లో ఆదివారం పిఠాపురం నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. నాలుగు దశాబ్దాల రాజకీయ అనుభవం, ఉమ్మడి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా పనిచేసి సైబరాబాద్ వంటి ప్రత్యేక నగరాన్ని తయారు చేసిన అనువజ్ఞుడు, టీడీపీ అధినేత చంద్రబాబును జగన్ ప్రభుత్వం అకారణంగా, కక్షపూరితంగా జైలులో పెట్టినప్పుడు బాధేసిందని జనసేనాని పవన్ కల్యాణ్ అన్నారు. రాజమహేంద్రవరం వెళ్తున్నప్పుడు దారిపొడవునా టీడీపీ కార్యకర్తలు తమ నాయకుడి కోసం పడిన తపన తనను కదిలించిందని, అందుకే సెంట్రల్ జైలులో చంద్రబాబును కలిశాక తన వంతుగా ఏదైనా చేయాలని భావించి కచ్చితంగా వచ్చే ఎన్నికల్లో రెండు పార్టీలు కలిసి వెళ్తాయని ప్రకటించానని ఆయన తెలిపారు. అప్పుడు తాను చెప్పినట్లుగానే బీజేపీ తమతో కలిసి వచ్చిందని చెప్పారు. ఆ పార్టీ కోసం ఎంపీ సీట్లు తగ్గించుకున్నానని తెలిపారు. తాను పొత్తు కోసం ఎంత తపించానో.. మూడు పార్టీల నాయకులు గెలుపు కోసం అంతే కష్టపడాలని సూచించారు. చిన్న చిన్న ఇబ్బందులు ఉన్నా వాటిని అధిగమించి పనిచేయాలని కోరారు. 'ఇప్పుడు ఇస్తున్న పథకాల కంటే అధికంగానే సంక్షేమ ఫలాలు పంచుతాం. మద్యం, గంజాయి, ఇసుక, ల్యాండ్ మాఫియా వంటి వాటిని అరికడితే అన్ని పథకాలకు కచ్చితంగా డబ్బులు సర్దుబాటవుతాయి. వైసీపీ దోపిడీ అరికడితే అప్పులు చేయకుండానే సంక్షేమ పథకాలు అమలు చేయవచ్చు. ఎన్నికల కోడ్ వల్ల ప్రతినెలా ఒకటో తేదీన అందాల్సిన సామాజిక పింఛన్లు ఈ నెల ఆలస్యం కావచ్చు. వలంటీర్లు లేకుండా పింఛన్లు సక్రమంగా పంపిణీ చేసేందుకు మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు ఎన్నికల నియామవళికి అనుగుణంగా అధికారులకు సహకరించాలి' అని సూచించారు.

ఉత్తరాదిపై మజ్లిస్ గురి!

- యూపీ, బిహార్‌లో ఖరారైన పొత్తులు
- వ్యూహాత్మకంగా హిందువులకూ టికెట్లు

హైదరాబాద్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు హైదరాబాద్ పాతనగరంలో.. ఎంసీహెచ్(ప్రస్తుతం జీహెచ్‌ఎంసీ) ఎన్నికల్లో పత్తర్‌గట్టీ డివిజన్ నుంచి విజయభేరీ మోగించిన మజ్లిస్ ఇత్తేహాదుల్ ముస్లిమీన్(ఎంఐఎం) క్రమంగా జాతీయ పార్టీగా ఎదుగుతోంది. ఈ క్రమంలో బిహార్, యూపీల్లో ఓటుబ్యాంకును.. ఓట్ల శాతాన్ని పెంచుకుంటూ ముందుకు పోతోంది. ఈ క్రమంలో ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో తమకు సిటింగ్ స్థానం ఉన్న మహారాష్ట్రతో పాటు.. యూపీ, బిహార్‌పై ప్రత్యేకంగా దృష్టిసారించింది. "మేము బీజేపీకి వ్యతిరేకం. అలాగని కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమికి మద్దతు కాదు. ఇండియా కూటమి కేవలం ఎన్నికల అవసరాలకే పరిమితం. మైనారిటీ, బడుగు వర్గాల అభ్యున్నతికి మేం పనిచేస్తాం" అని మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఒవైసీ స్పష్టం చేశారు. యూపీలో డాక్టర్ పల్లవి పటేల్ నాయకత్వంలోని అప్నాదళ్(కామెరవాడి)తో కలిసి పోటీ చేస్తామని ఆదివారం ఆయన ప్రకటించారు. ప్రగతిశీల మానవ్ సమాజ్ పార్టీ, రాష్ట్రీయ ఉదయ్ పార్టీతోనూ పొత్తు ఉంటుందని, బిహార్‌లోనూ ఎన్డీయే-ఇండియా కూటముల్లో లేని పార్టీలను కలుపుకొనిపోతున్నట్లు వివరించారు. ఉత్తరప్రదేశ్‌లో ఏడు, బిహార్‌లో 11 స్థానాల్లో పోటీ చేస్తున్నట్లు తెలిపారు. బిహార్‌లో ఐదు చోట్ల హిందువులకు మజ్లిస్ టికెట్ ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. మహారాష్ట్రలో గతంలో ఎంవీఏతో కలిసి పోటీ చేసిన మజ్లిస్.. ఈ సారి ఒంటరిగా వెళ్తోంది. తమ పార్టీ ఔరంగాబాద్ సిటింగ్ ఎంపీ ఇంతియాజ్ జలీల్ అదేస్థానంలో పోటీ చేయనుండగా.. మైనారిటీల బలం ఎక్కువగా ఉన్న మరో నాలుగు చోట్ల మజ్లిస్ బరిలోకి దిగనున్నట్లు తెలుస్తోంది. కర్ణాటకలో సమీకరణాలు అనుకూలంగా లేనందున పోటీ చేయడం లేదని మజ్లిస్ వర్గాలు తెలిపాయి.


సూర్యాపేటలో మాజీ సీఎం కేసీఆర్‌కు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి


తుంగతుర్తి మండలం వెలుగుపల్లిలో స్వాగతం పలుకుతున్న కార్యకర్తలు


అర్వపల్లిలో స్వాగతం పలుకుతున్న కార్యకర్తలు

పంటలు పరిశీలిస్తూ..

జిల్లాలో ఎండిన పొలాలను మాజీ సీఎం కేసీఆర్ ఆదివారం పరిశీలించారు. ఆయనకు పార్టీ నాయకులు స్వాగతం పలికారు. కేసీఆర్ జనగామ జిల్లాతో పాటు సూర్యాపేట జిల్లాలోని తుంగతుర్తి మండలం, సూర్యాపేట రూరల్ మండలాల్లో ఎండిన పంట పొలాలను పరిశీలించారు. అక్కడ ఎండిన పంట పొలాల రైతులతో మాట్లాడారు.


వెలుగుపల్లిలో కేసీఆర్‌కు స్వాగతం పలుకుతున్న కార్యకర్తలు


యర్కారంలో మహిళ రైతు సరోజనమ్మతో మాట్లాతున్న కేసీఆర్




ఎండిన వరి కంకులు పరిశీలిస్తున్న మాజీ సీఎం కేసీఆర్

కేసీఆర్ కాన్వాయ్ బస్సు తనిఖీ

తిరుమలగిరి: సూర్యాపేట జిల్లా పర్యటనకు వస్తున్న మాజీ సీఎం కేసీఆర్ కాన్వాయ్‌లోని బస్సును ఎన్నికల కోడ్‌లో భాగంగా అధికారులు ఆదివారం తనిఖీ చేశారు. జిల్లా సరిహద్దు తిరుమలగిరి మునిసిపాలిటీ పరిధిలోని ఈదులపర్రెతండా వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద మధ్యాహ్నం 12 గంటలకు బస్సు ఆపి అధికారులు తనిఖీలు నిర్వహించారు. తనిఖీల అనంతరం 10 నిమిషాల తర్వాత బస్సు అక్కడి నుంచి బయలుదేరింది. తనిఖీ చేసిన వారిలో డీటీ ఎస్ఎస్‌టీం లీడర్ డీటీ జాన్‌మహ్మద్, మల్లయ్య, వెంకన్న, చందు, వీరన్న తదితరులు ఉన్నారు.



కేసీఆర్ సుడిగాలి పర్యటన



సూర్యాపేట(కలెక్టరేట్), మార్చి 31: జిల్లాలో ఎండిన పొలాలను మాజీ సీఎం కేసీఆర్ సూర్యాపేట పట్టణంలోని ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి క్యాంపు కార్యాలయానికి చేరుకున్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు మాజీ సీఎం కేసీఆర్‌కు పుష్పగుచ్ఛాలు అందించి ఫొటోలు దిగేందుకు ప్రయత్నించగా ఆయన సున్నితంగా తిరస్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీలు సంతోష్‌కుమార్, బడుగుల లింగయ్య యాదవ్, ఎమ్మెల్యేలు గుంటకండ్ల జగదీష్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ గుజ్జ దీపికాయుగంధర్‌రావు, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూధనాచారి, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిశోర్‌కుమార్, బొల్లం మల్లయ్యయాదవ్, చిరుమర్తి లింగయ్య, రమావత్ రవీంద్రనాయక్, నల్లమోతు భాస్కర్‌రావు, గొంగిడి మహేందర్‌రెడ్డి, నాయకులు ఒంటెద్దు నర్సింహ్మారెడ్డి, గ్యాదరి బాలమల్లు, తిప్పన విజయసింహారెడ్డి, నల్లగొండ, భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గాల బీఆర్ఎస్ అభ్యర్థులు కంచర్ల క్రిష్ణారెడ్డి, క్యామ మల్లేష్‌యాదవ్, పెరుమాళ్ల అన్నపూర్ణ, గోప గాని వెంకటనారాయణగౌడ్, నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, జీవన్‌రెడ్డి, నెమ్మాది భిక్షం, జీడి భిక్షం, కుమారిబాబూనాయక్, సత్యనారాయణరెడ్డి, గండూరి ప్రకాష్, మారిపెద్ది శ్రీనివాస్‌గౌడ్, ఉప్పల ఆనంద్, సత్యనారాయణ, బూర బాలసైదులుగౌడ్ ఉన్నారు.

అర్వపల్లి: ఎండిన పొలాలను పరిశీలించేందుకు జనగాం జిల్లా నుంచి అర్వపల్లి మండల కేంద్రం నుంచి బస్సులో వెళ్తున్న మాజీ సీఎం కేసీఆర్‌కు ఆదివారం నాయకులు, కార్యకర్తలు అభివాదం చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ దావుల వీరప్రసాద్ యాదవ్, బైరబోయిన రామలింగయ్య, కనుకు శ్రీనివాస్, లింగరాజు, బొడ్డు రామలింగయ్య, శైలేందర్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరి: మాజీ సీఎం కేసీఆర్‌కు బీఆర్ఎస్ మండల నాయకులు ఘన స్వాగతం పలికారు. బస్సులో నుంచే కేసీఆర్ పార్టీ శ్రేణులకు అభివాదం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సంకెపల్లి రఘునందన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ సతీష్, నరోత్తంరెడ్డి, పాల్గొన్నారు.

నాగారం: తుంగతుర్తి నియోజకవర్గంలో ఎండిన పంట పొలాలను పరిశీలించడానికి మాజీ సీఎం కేసీఆర్‌కు కార్యకర్తలు స్వాగతం పలికారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కె.ఉప్పలయ్య, గుండగాని అంబయ్య, యరాల రాంరెడ్డి, చిల్లర చంద్రమౌళి, ఈదుల కిరణ్, ఈరెటి అంజి, తరాల అంజనేయులు, పోదిల రమేష్, కుంభం లింగయ్య, దోమల బాలమల్లు ఉన్నారు.

రైస్ మిల్లులపై చర్యలు తీసుకోవాలి


రాస్తారోకో చేస్తున్న మహిళలు

నేరేడుచర్ల, మార్చి 31: నేరేడుచర్లలోని రైస్ మిల్లులపై చర్యలు తీసుకోవాలని రాఘవేంద్ర కాలనీవాసులు డిమాండ్ చేశారు. జాన్‌పహాడ్ రోడ్డుపై ఆదివారం రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మిల్లు నుంచి వచ్చే దుమ్ము ధూళి, పొగతో దుర్భరమైన వాసన రావడంతో గృహాల్లో ఉండలేకపోతున్నామని వాపోయారు. తెల్లవారే సరికి ఇంటి పరిసర ప్రాంతాలు మొత్తం బూడిదతో నిండిపోతున్నాయన్నారు. ఎన్నిసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. జాన్‌పహాడ్ రోడ్డులో ఉన్న రెండు మిల్లులపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆకారపు వెంకటేశ్వర్లు, చూపూరి మల్యాద్రి, ప్రభాకర్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, తాడోజు శ్రీనివాసులు, ప్రభాకర్‌రెడ్డి, రమణమ్మ, సరిత, నందిని, మమత, వాసా పల్లయ్య, హుస్సేన్ పాల్గొన్నారు.

బీజేపీ సమావేశాన్ని విజయవంతం చేయాలి

హుజూర్‌నగర్, మార్చి 31: బీజేపీ హుజూర్‌నగర్ నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు భాగ్యరెడ్డి కోరారు. ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సోమవారం ఉదయం 10 గంటలకు పట్టణంలోని పార్టీ కార్యాలయంలో పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఈ సమావేశం ఏర్పాటుచేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు వీరబాబు, విజయ్, రామరాజు, రవి, గోపి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో లక్ష కుంకుమార్చన

మేళ్లచెర్వు, మార్చి 31: మైహోం పరిశ్రమలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా అహోబిల రామానుజజీయర్ స్వామి సమక్షంలో శ్రీదేవి, భూదేవి అమ్మవార్లకు లక్ష కుంకుమార్చనలు నిర్వహించారు. ఆదివారం మూడో రోజు కల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎదుర్కోళ్ల ఉత్సవం, హనుమద్వాహసన, యజ్ఞశాల ప్రారంభం కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో మైహోం గ్రూప్ చైర్మన్ జూపల్లి రామేశ్వరరావు, సంస్థ ప్రతినిధులు మునగాల రామ్మోహన్‌రావు, ప్లాంట్ హెడ్ శ్రీనివాసరావు, తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ బి. రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీ మండల అధ్యక్షుడిగా గణేష్



తిరుమలగిరి, మార్చి 31: కాంగ్రెస్ అనుబంధ సంఘం ఐఎన్‌టీయూసీ మండల అధ్యక్షుడిగా తిరుమలగిరికి చెందిన పానుగంటి గణేష్ నియమితులయ్యారు. సంఘం జిల్లా అధ్యక్షుడు ఆలకుంట్ల బాలకృష్ణ ఆయనకు నియామక పత్రం అందజేశారు. తన నియామకానికి సహకరించిన సంఘం నాయకులకు గణేష్ కృతజ్ఞతలు తెలిపారు. సంఘం బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

కోలాహలంగా నృసింహుడి కల్యాణం

మఠంపల్లి, మార్చి 31: మట్టపల్లి లక్ష్మీనృసింహుడి నిత్యాకల్యాణాన్ని వేదపండితులు ఆదివారం కన్నుల పండువగా శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయంలో విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్య ప్రాసన స్వామివారికి మాంగళ్యధారణ తలంబ్రాలతో నిత్య కల్యాణం వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు నీరాజనమంత్రపుష్పాలతో మహానివేదన గావించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈవోసిరికొండ నవీన్ పాల్గొన్నారు.

లింగయ్య ఆశయ సాధనకు కృషి చేయాలి

హుజూర్‌నగర్, మార్చి 31 : సీపీఐ నాయకుడు ఎనికె లింగయ్య ఆశయాలు సాధించాలని పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు కంబాల శ్రీనివాసు, గుండు వెంకటేశ్వర్లు అన్నారు. లింగయ్య ఆదివారం పట్టణంలో అనారోగ్యంతో మృతిచెందారు. ఆయన మృతదేహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగావారు మాట్లాడుతూ లింగయ్య మృతి పార్టీకి తీరని లోటన్నారు. ఈ కార్యక్రమంలో జడ శ్రీనివాస్, యల్లావుల రమేష్, జక్కుల రమేష్, సత్యావతి, ప్రసాద్, వెంకన్న, రమణ తదితరులు పాల్గొన్నారు.

చెరువు ఆక్రమణ అడ్డుకున్న అధికారులు


మట్టి కుప్పలను పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

కోదాడ రూరల్, మార్చి 31: మండలంలోని తమ్మరబండపాలెంలోని రావిగుంట చెరువు భూమిని ఆక్రమించుకునేందుకు కొందరు టిప్పర్లతో మట్టితోలి చదును చేసేందుకు రెండు రోజులుగా ప్రయత్నిస్తున్నారు. ఈ విషయంపై తమ్మర గ్రామానికి చెందిన కొందరు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు ఆదివారం చెరువు భూమిని పరిశీలించారు. శ్రీబాలాజీ వెంకటేశ్వర స్వామి దేవాలయం సమీపంలో ఉన్న రావిగుంట చెరువును మట్టి టిప్పర్లలో మట్టిని నింపుతూ ఆక్రమణకు పాల్పడేందుకు చెరువులో మట్టి కుప్పలు పోశారు. అధికారులు మట్టి కుప్పలను, చెరువును పరిశీలించారు. చెరువు విస్తీర్ణం 5.14ఎకరాలుగా ఉంది. గతంలో ఈ చెరువు బాలాజీ వెంకటేశ్వరస్వామి దేవాలయానికి కోనేరుగా ఉపయోగించుకునే వారన్నారు. ఈ చెరువు పక్కన నుంచే కోదాడ-ఖమ్మం బైపాస్ రోడ్డు వెళ్తుండడంతో ఆక్రమణదారులు చెరువుపై కన్నేశారు. రెండురోజులుగా చెరువును ఆక్రమించుకునేందుకు టిప్పర్ల ద్వారా మట్టిని తోలుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. కోదాడ-ఖమ్మం బైపాస్ రహదారి వెంట ఇటీవల భూములకు ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో ఆక్రమణదారులు చెరువు భూమిపై కన్నేశారని ఆరోపించారు. చెరువుభూమి ఆక్రమణకు గురికాకుండా ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ప్రభుత్వ భూమిలో బోర్డు తొలగింపు

కోదాడ రూరల్, మార్చి 31: మండలంలోని కొమరబండ గ్రామంలో రెండు రోజుల కిందట రెవెన్యూ అధికారులు ప్రభుత్వ భూమిలో ఏర్పాటు చేసిన బోర్డును ఆక్రమణదారులు శనివారం రాత్రి తొలగించారు. గ్రామంలోని జాతీయ రహదారి పక్కన 48 సర్వే నెంబర్‌లో ఎకరం మూడు కుంటల ప్రభుత్వ భూమి ఉంది. ఈ భూమి జాతీయ రహదారి పక్కన ఉండడంతో కోట్ల రూపాయల ధర పలుకుతోంది. దీనిపై కన్నేసిన కొంతమంది ఆక్రమణదారులు వారంరోజుల కిందట ఈ స్థలంలో ఉన్న చెట్లు, కంపచెట్లను తొలగించి భూమి చదును చేశారు. విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారి ఆర్‌ఐవో సూర్యనారాయణ భూమి వద్దకు చేరుకుని పరిశీలించారు. ఇది ప్రభుత్వానికి సంబంధించిన భూమి అని, ఎవరు ఆక్రమణకు ప్రయత్నించినా, భూమిలో ఆక్రమణలు చేపట్టినా కఠిన చర్యలు తీసుకుంటావని హెచ్చరించారు. ఇందుకు సంబంధించిన రెండు బోర్డులను సైతం ప్రభుత్వ భూమిలో ఏర్పాటు చేశారు. ఏర్పాటు చేసిన 24గంటల్లోనే ఆక్రమణదారులు బోర్డును తొలగించారు. ఆక్రమణదారుల నుంచి ప్రభుత్వ భూమిని కాపాడాలని, బోర్డు తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేశారు.

ఉద్యోగులు అంకితభావంతో పనిచేయాలి

అనంతగిరి, మార్చి 31: ఉద్యోగులు అంకితభావంతో పని చేయాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ నిరంజన్, జిల్లా అసంక్రమిత వ్యాధుల నివారణ అధికారి డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి అన్నారు. ఉద్యోగ విరమణ చేసిన మంచిరాజు లక్ష్మీకాంతారావు దంపతులను త్రిపురవరం పాథమిక ఆరోగ్య కేంద్రం ఆదివారం సన్మానించారు. రెవెన్యూ శాఖలో వీఆర్వోగా ఉద్యోగం పొంది, ఆ తర్వాత వైద్య, ఆరోగ్య శాఖలో సేవలు అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి లక్ష్మీప్రసన్న, పల్లె దవాఖాన వైద్యులు హరినాథ్, ప్రసన్న, ఆరోగ్య సిబ్బంది రత్న మేరీ, కళావతి, వెంకమ్మ, శైలజ, మహేష్, విజయ్ కుమార్, కృష్ణమూర్తి, శ్రీదేవి, విజయ, మంజుల, రమ పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయ నిర్మాణానికి కృషి

హుజూర్‌నగర్, మార్చి 31: వేపలసింగారంలో నిర్మిస్తున్న శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయ నిర్మాణానికి భక్తులు సహకరించాలని నిర్మాణ కమిటీ అధ్యక్షుడు వెంకటాచారి కోరారు. దేవాలయ ఆవరణలో ఆదివారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. భక్తుల సహకారంతో ఆలయ నిర్మాణం చేస్తున్నామన్నారు.

అవినీతిపై ప్రశ్నిస్తే అరెస్టు చేయడం అన్యాయం



పోలీసుల అదుపులో నాయకులు

సూర్యాపేటటౌన్, మార్చి 31: గత ప్రభుత్వం చేసిన అవినీతిని ప్రశ్నిస్తే ముందస్తుగా అరెస్టు చేయడం దారుణమని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ అన్నారు. జిల్లాలో మాజీ సీఎం కేసీఆర్ పర్యటన సందర్భంగా మాస్‌లైన్ నాయకులను పోలీసులు ఆదివారం ముందస్తు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ని అరెస్టులు చేసినా ప్రజల సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేస్తామని స్పష్టం చేశారు. అరెస్టు అయిన వారిలో పీవోడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రేణుక, నాయకులు ఎర్ర అఖిల్‌కుమార్, ఎస్‌కే సయ్యద్ ఉన్నారు. మాజీ సీఎం కేసీఆర్ జిల్లా పర్యటన సందర్భంగా మాస్‌లైన్ నాయకులను ముందస్తు అరెస్టు చేయడం సరికాదని ఆ పార్టీ నాయకుడు కారింగుల వెంకన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని విక్రమ్‌భవన్‌లో ఆదివారం జరిగిన సమయావేశంలో మాట్లాడారు. అక్రమంగా అరెస్టు చేసిన మాస్‌లైన్ నాయకులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వాజిద్, గులాం, పిడమర్తి లింగయ్య, గౌస్, పద్మజ, అంజయ్య పాల్గొన్నారు.

మద్దిరాల: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సూర్యాపేట పర్యటనకు వస్తున్న సందర్భంగా సీపీఐఎంఎల్ నాయకులను ముందస్తుగా అరెస్టు చేయడం అప్రజాస్వామికమని ఆ పార్టీ జిల్లా నాయకుడు పేర్ల నాగయ్య అన్నారు. మండలకేంద్రంలో ఆదివారం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణకు కాపలా కుక్కలా ఉంటానని చెప్పిన కేసీఆర్ పదేళ్ల కాలంలో అనేక కుంభకోణాలకు పాల్పడి వాటిపై విచారణ చేయాలని తమ పార్టీ నాయకులు డిమాండ్ చేస్తే అరెస్టు చేయడం ఎంత వరకు సమంజసమని అన్నారు. అరెస్టు చేసిన నాయకులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు గొడ్డలి నర్సన్న, కాసర్ల దుర్గయ్య, సూరారపు మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి యోగాసన పోటీల్లో ప్రథమస్థానం



మెడల్ చూపుతున్న నాగేశ్వర్‌రావు

సూర్యాపేట సిటీ, మార్చి 31: తమిళనాడు రాష్ట్రం దిండిగుల్ పట్టణంలో కేంద్ర యువజన, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన నాలుగో జాతీయ స్థాయి యోగాసన ఛాంపియన్ షిప్ పోటీల్లో సూర్యాపేట జిల్లాకేంద్రానికి చెందిన యోగ గురువు గూడూరు నాగేశ్వర్‌రావు మొదటి స్థానం పొందారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం నుంచి 38మంది యోగా గురువులు యోగాసన పోటీల్లో పాల్గొన్నట్లు తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన తనకు జాతీయ స్థాయిలో ఉత్తమ యోగాసన గురువుగా ప్రతిభ పురస్కారాన్ని కేంద్ర యువజన, క్రీడల మంత్రిత్వ శాఖ నిర్వాహకులు అందజేశారని తెలిపారు. నాగేశ్వర్‌రావును ఉమ్మడి నల్లగొండ జిల్లా యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కోట సింహాద్రి, జనరల్ సెక్రటరీ రాయనబోయిన శ్రీను తదితరులు అభినందించారు.

ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి : బీజేపీ

కోదాడటౌన్, మార్చి 31: గిట్టుబాటు ధర అందించి ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కనగాల నారాయణరావు ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం కంటే క్వింటాల్‌కు రూ.500లు బోనస్ ప్రకటించి కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటి వరకు ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించలేదని తెలిపారు. రూ.500 ఎంఎస్పీ పెంచకపోగా బహిరంగ మార్కెట్లో ఇప్పటి వరకు క్వింటాల్‌కు రూ.2800 ధాన్యాన్ని చెల్లించి, కొనుగోలు చేసిన ప్రైవేట్ వ్యాపారులు అందరూ కుమ్మక్కై క్వింటాల్ రూ.1950లకు కొనుగోలు చేస్తున్నారని ఆరోపించారు. దీనిని అరికట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని పేర్కొన్నారు.

ఘనంగా సాముహిక జన్మదిన వేడుకలు


సాముహిక జన్మదిన వేడుకల్లో పాల్గొన్న రిటైర్డ్ ఉద్యోగులు

సూర్యాపేటటౌన్, మార్చి 31: మార్చి నెలలో జన్మించిన రిటైర్డ్ ఉద్యోగులకు జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల కార్యాలయంలో ఆదివారం సాముహిక జన్మదిన వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ఎన్. సుదర్శన్‌రెడ్డి, గాదె వెంకట్‌రెడ్డి, గోపాల్, బొడ్డు వీరయ్య, మాలి జనార్థన్‌రెడ్డి, మాత్యూను, చెట్టుపల్లి దేవయ్య, పర్వతాలు, వెంకటయ్య పాల్గొన్నారు.

సమిష్టిగా పండుగలు జరుపుకోవాలి

మఠంపల్లి, మార్చి 31: ప్రశాంత వాతవరణంలో గిరిజనులు పండుగలు జరుపుకోవాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భూక్య మంజూనాయక్ అన్నారు. మండలంలోని గుర్రంబోడుతండాలో శనివారం రాత్రి హోలి పండుగ నిర్వహించారు. గిరిజనుల సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ పాటు పడిందన్నారు. గిరిజనులు సంప్రదాయ పద్ధతిలో హోలీ వేడుకలు నిర్వహించుకోవడం సంతోషమన్నారు.

చిన్నారిపై వీధి కుక్కల దాడి

సూర్యాపేటరూరల్, మార్చి31: చిన్నారిపై వీధి కుక్కలు దాడి చేశాయి. ఈ సంఘటన మునిసిపల్ పరిధిలోని పిల్లలమర్రి గ్రామంలో శనివారం రాత్రి జరిగింది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన చిలుక నాగరాజు కుమార్తె సాయిరిది ఆరుబయట ఆడుకుంటుండగా కుక్కలు దాడి చేశాయి. సాయిరిధిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కాగా ఇటీవల పిల్లలమర్రిలో కుక్కల దాడులు పెరిగాయని అదే కాలనీలో చందుపట్ల క్రిష్ణ కూతురిని కూడా కుక్కలు గాయపరిచాయని వాపోతున్నారు.

సంక్షిప్త సమాచారం..



నేరేడుచర్ల: నేరేడుచర్ల పట్టణంలోని జాన్‌పహాడ్ రోడ్డులో దుకాణాల ఎదుట ఎండలో కూర్చొని టైలర్ వృత్తి నిర్వహిస్తున్న మైబెల్లి, శంకర్‌లకు ఆదివారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నీడ కోసం పెద్ద గొడుగులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు చల్లా ప్రభాకర్‌రెడ్డి, జోన్ చైర్మన్ యడవెల్లి సత్యనారాయణరెడ్డి, బట్టు మధు, సుంకరి క్రాంతికుమార్, కందిబండ శ్రీనివాసరావు, జిలకర రామస్వామి, కనకయ్య, జగిని సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కోదాడ రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ రూరల్ ఏఈ ఆర్.శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రామాపురం 132 కేవీ సబ్‌స్టేషన్ నుంచి 33కేవీ తొగర్రాయి ఫీడర్ చెట్ల కొమ్మల తొలగింపు, మరమ్మతుల కారణంగా ఉదయం 6 గంటల నుంచి 11 గంటల వరకు తొగర్రాయి పరిధిలో కాపుగల్లు, తొగర్రాయి, గణపవరం, కూచిపూడి, గుడిబండ గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. దొరకుంట అగ్రికల్చర్ ఫీడర్ పరిధిలోని బండపాలెం, తమ్మర అగ్రికల్చర్, అల్వాల్‌పురం అగ్రికల్చర్ ఫీడర్లలో ఉదయం 6 గంటల నుంచి 9 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

హుజూర్‌నగర్: పట్టణంలోని కనకదుర్గమ్మ దేవాలయంలో సోమవారం విగ్రహ ప్రతిష్ఠ వార్షికోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు అర్చకులు నరగిరినాథుని రంగభట్టాచార్యులు తెలిపారు. మహోత్సవాల సందర్భంగా దేవాలయంలో ఉదయం ప్రాతఃకాల పూజలు అనంతరం అభిషేకాలు నిర్వహించనున్నారు. అమ్మవారిని పెళ్లిచీరెతో అలంకరించనున్నారు. సాయంత్రం భక్తిగీతాలు ఆలపించనున్నారని తెలిపారు.

సూర్యాపేటక్రైం: ఐపీఎల్ క్రికెట్ పేరుతో బెట్టింగులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ రాహుల్‌హెగ్డే ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పౌరులను, యువకులు బెట్టింగ్ మాఫియాలో పడవద్దని సూచించారు. బెట్టింగ్‌పై ఏలాంటి సమాచారం ఉన్నా కంట్రోల్ రూం నెంబర్ 8712686026కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

కోదాడటౌన్: కోదాడ విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్షుడు వేనేపల్లి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పోలీసులు, జర్నలిస్టులకు, హెల్త్ ఇన్సురెన్స్ నగదు రహిత ఆపరేషన్లు చేయడంతో పాటు ఆరోగ్య శ్రీ, ఆహార భద్రత కార్డు కలిగి ఉన్న వారికి ఉచితంగా చెకప్‌లు చేసి అవసరమైన ఆపరేషన్లు చేస్తామన్నారు.

నేరేడుచర్ల: నేరేడుచర్ల తహసీల్దార్ కార్యాలయం సమీపంలో నిర్మిస్తున్న నూతన కోదండరామాలయంలో ప్రతిష్ఠించనున్న విగ్రహాల ఊరేగింపు నేడు సోమవారం ఊరేగింపు నిర్వహిస్తున్నందున భక్తులు పాల్గొనాలని దేవస్థానం కమిటీ ఒక ప్రకటనలో తెలిపింది. ఉదయం 8 గంటలకు శ్రీవాణి ఇంగ్లీషు మీడియం స్కూల్ ఆవరణ నుంచి ఊరేగింపు ప్రారంభమవుతుందని తెలిపారు. నేరేడుచర్లలోని ప్రతిఒక్కరూ ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

పాలకవీడు: కేంద్రప్రభుత్వం ప్రజలపై ప్రేమను నటిస్తూ ఇటీవల సన్న బియ్యాన్ని రూ.29లకే అందిస్తామని ప్రకటించి 50రోజులు కావొస్తున్నా ఇప్పటికీ బియ్యం కేంద్రాలు తెరవలేదని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు దూళిపాళ ధనుంజయనాయుడు ఒక ప్రకటనలో విమర్శించారు. 2014 నుంచి సన్న బియ్యం ధరలకు రెక్కలు వచ్చి కిలో రూ.64ల వరకు అమ్ముతున్నారని పేర్కొన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం ఏనాడు బియ్యం ధరలు తగ్గించలేకపోయారని విమర్శించారు.

సూర్యాపేటటౌన్: జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల కార్యాలయంలో శరత్‌మాక్సీవిజన్ లేజర్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో నేడు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు దండ శ్యాంసుందర్‌రెడ్డి, నాగేశ్వర్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. హెల్త్‌కార్డు ఉన్న వారికి ఉచిత పరీక్షలతో పాటు అవసరమైతే శస్త్ర చికిత్స నిర్వహించనున్నట్లు తెలిపారు.

తిరుమలగిరి: ఐపీఎల్, క్రికెట్, ఆన్‌లైన్ బెట్టింగ్‌లపై పోలీసులకు సమాచారం తెలపాలని ఎస్‌ఐ సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో బెట్టింగ్‌లపై నిఘా ఏర్పాటు చేసిందని, బెట్టింగ్‌లకు పాల్పడిన. ప్రోత్సహించినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. బెట్టింగ్‌ల వల్ల నష్టపోయి ఎంతో మంది జీవితాలు ఆగమయ్యాయని, యువత బెట్టింగ్‌లకు అలవాటుపడొద్దని సూచించారు.

ఆత్మకూర్ (ఎస్): మండలంలోని పాతర్లపహాడ్‌కు చెందిన కాకి అనంతరెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. అనంతరెడ్డితో పాటు 1996-97లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం గ్రామ పంచాయతీ కార్యాలయానికి ఫ్రీజర్ బాక్స్‌ను అందజేశారు. అనంతరెడ్డి తండ్రి కాకి సత్తిరెడ్డి సాయంతో ఫ్రిజర్ బాక్స్‌ను గ్రామానికి అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు లింగ ప్రసాద్, జానయ్య, పవన్, శ్రీకాంత్, ఉపేందర్, గోపాల్, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.



మేళ్లచెర్వు: యునైటెడ్ ఎన్జీవో అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడిగా చింతలపాలెం మండలకేంద్రానికి చెందిన ఉపతల రాంబాబు ఎంపికపై పలువవురు హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు యాదవరాజు, ఆంధ్ర రాష్ట్ర ప్రెసిడెంట్ ఉపతల రాంబాబు హర్యానా రాష్ట్ర గవర్నర్ దత్తాత్రేయను మర్యాదపూర్వకంగా కలిశారు. రాంబాబు, యాదవ రాజును అభినందించారు. ఉప్పల రాంబాబు ఎన్నిక పట్ల 1995వ టెన్త్ బ్యాచ్ విద్యార్థులు ఆయన ఎంపిక పట్ల అభినందనలు తెలియజేశారు.